క్లుప్తంగా

రహదారుల నిర్మాణం

మండవల్లి: మండలంలోని లింగాలలో రూ.39 లక్షల ఎన్ఆర్జీఈఎస్ నిధులతో నిర్మించిన నాలుగు రహదారులను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎన్డీఏ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, ముళ్ల పూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

గుడివాడరూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు అన్నారు. మండలంలోని రామనపూడి అడ్డరోడ్డు వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే ఎటువంటివారిపైనా అయినా చర్యలు తీసుకుంటామన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నిభానుపూడి(పామర్రు): రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని నిభానుపూడిలో నిర్వహిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ రహదారి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సురేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అశోక్, నవీన్, మాజీ ఉప సర్పంచ్ రత్నకుమారి, రూతమ్మ పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

గుడివాడరూరల్: ప్రైవేట్ స్కూల్స్ డెమోక్రటిక్ అసోసియేషన్ గుడివాడ డివిజన్ ఆధ్వర్యంలో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలను స్థానిక స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ రెండో రోజు శనివారం ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ తదితర పోటీలు జరిగాయి. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్జా ప్రసాద్, కార్యదర్శి లింగమనేని జగదీష్, కోశాధికారి లంకపల్లి శ్రీనివాస్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు పుట్టి రామచంద్రశేఖర్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెంకన్నకు మొక్కులు తీర్చుకున్న భక్తులు

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామికి మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలో నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వేలాది భక్తులకు కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల వితరణతో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్తీర్ణత శాతం పెరిగేందుకు ప్రత్యేక తరగతులు

గుడ్లవల్లేరు: పదో తరగతిలో పట్టు సాధించి, రాబోయే పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెరిగేందుకు 100రోజుల ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జి.గోపాలరావు తెలిపారు. అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల్లో టెన్త్ విద్యార్థినులకు నిర్వహించిన ప్రత్యేక తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా టెన్త్‌లో మార్కులను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు మాధవరావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆలయానికి దాతల విరాళం

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయానికి దాతలు విరాళాలను అందజేశారని ఈఓ పీవీఎస్వీ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గుడివాడ వాస్తవ్యులు పంచకర్ల ఉదయలక్ష్మి, కుమార్తె పంచకర్ల రుచిత స్వామికి రూ.18,500ను విరాళంగా అందజేశారని పేర్కొన్నారు.

జాబ్‌మేళాకు 54 మంది హాజరు

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 54 మంది హాజరయ్యారు. వీరిలో తొమ్మిది మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.జితేంద్రబాబు, ప్రిన్సిపాల్ శాంతి జ్యోతి, జేడీఎం పార్థసారథి పాల్గొన్నారు.

రామాలయంలో గీతా పారాయణ

పామర్రు: స్థానిక గాంధీనగర్‌లోని శ్రీరామాలయంలో ధనుర్మాసం పురస్కరించుకుని భక్తులు గీతాపారాయణను శనివారం నిర్వహించారు. సమాజ గురువు బావురపల్లి పద్మజ ఆధ్వర్యంలో బృందం సభ్యులు లలితా, విష్ణు సహస్ర నామ పారాయణతో పాటుగా హనుమాన్ చాలీసా, లక్ష్మీ అష్టోత్తరం తదతరాలను భక్తి శ్రద్ధలతో పఠించారు. ఆలయంలో తొలుత గోదా రంగనాథ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్లు ఇలా.. ప్రయాణించేది ఎలా?

- గుడ్లవల్లేరు మండలంలో రహదారుల దుస్థితి
- అడుగడుగునా గుంతలే..



దోకిపర్రు నాగేంద్రస్వామి గుడి వద్ద రోడ్డు గుంతల్లో నిలిచిన వర్షం నీరు

గుడ్లవల్లేరు: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో అడుగు ముందుకు పడటం లేదు. కాలు కదలటం లేదు. కూరాడ నుంచి సుబ్బిచెరువు రహదారి, కౌతవరం నుంచి డోకిపర్రు వెళ్లే రహదారులు అడుగడుగునా గుంతలమయంగా మారాయి. కంకర రాళ్లు పైకి తేలాయి. కాలి నడక కూడా ఈ రోడ్లపై కష్టతరంగా మారింది. డోకిపర్రు, కౌతవరం, పసుభొట్లపాలెం, పెదపాలెం, మీర్జాలపాలెం, పొనగంటిగూడెం, కూరాడ, శేరీ దగ్గుమిల్లి, పురిటిపాడు, చినగొన్నూరు, చింతలగుంట, తాడిచెర్ల, సుబ్బిచెరువు, విన్నకోట గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చి వెళ్లే రాకపోకల్లో ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నారు.



మీర్జాలపాలెం వద్ద అడుగడుగునా గుంతలే

వర్షం వస్తే ఇక అంతే..

రోడ్లు పూర్తిగా పాడైపోయిన కారణంగా వర్షాలు వచ్చినపుడు ఆ రోడ్లపై ఉన్న గుంతలు లోతు తెలియకపోవటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఆ గోతుల్లో పడిపోయి తీవ్ర గాయాల పాలవుతున్నారు.

తమ ప్రయాణంలో ప్రత్యక్ష నరకం కనబడుతుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిందంటే రోడ్లపై గోతుల్లో వర్షం నీరు చేరి ఎంత లోతు ఉందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నామని వాపోతున్నారు. వెంటనే ఈ రోడ్లను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



పెదపాలెం వద్ద గుంతలు పడిన రోడ్డు

రోడ్లను వెంటనే నిర్మించాలి



ఆధ్వానంగా మారిన రోడ్లను కూటమి ప్రభుత్వం వెంటనే నిర్మించాలి. అధికారంలోకి రాగానే అన్ని రహదారులను నిర్మిస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఇపుడు ఎందుకు పట్టించుకోవడం లేదు? ప్రజలు రోడ్లు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

– మేకల అనిల్, వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్లవల్లేరు

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పబ్బం



కూటమి ప్రభుత్వం చేపట్టిన సీసీ రోడ్ల పనులకు నిధులను ఇచ్చేది ఉపాధి హామీ ద్వారా కేంద్ర ప్రభుత్వమే. ఇప్పటివరకూ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల పనులకు ఎలాంటి నిధులను ఇవ్వలేదు. కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ సర్కార్ పబ్బం గడుపుకుంటోంది.

– పిడుగు దేవసహాయం, సీపీఎం మండల నాయకుడు, గుడ్లవల్లేరు

సమన్వయంతో అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రామిశెట్టి

ముదినేపల్లి రూరల్ : స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారుల సహకారం లేనిదే ప్రభుత్వ కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయలేమన్నారు. కొన్ని శాఖల అధికారులు మండల పరిషత్ సమావేశానికి హాజరు కాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఎంపీడీఓ వై రామకృష్ణ, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, కో–ఆప్షన్ మెంబర్ అల్లా భక్షు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసిన ఎంఈఓలు

గుడ్లవల్లేరు: రాబోయే పబ్లిక్ పరీక్షలకు సమాయత్తమయ్యేందుకు పదో తరగతి విద్యార్థులకు శనివారం అంగలూరులో స్టడీ మెటీరియల్‌ను ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్మోహనరావు అందజేశారు. ఈ మెటీరియల్‌ను యూటీఎఫ్ నాయకులు అందజేసినట్లు ఎంఈఓలు తెలిపారు. ఈ మెటీరియల్‌ను 1991–92లో గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థుల సాయంతో 450మంది విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు మాధవరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ టెస్టు పేపర్ల పంపిణీ

కైకలూరు: పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ముద్రించిన మోడల్ టెస్టు పేపర్లను దాతలు జి.నాగరాజారావు, వీవీ.రాజారావు, జి.నాగ పెద్దిరాజు సహకారంతో భుజబలపట్నం ఉన్నత పాఠశాల్లో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ డి.రామారావు, రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవిశంకర్, హెచ్ఎం ఎం.ఎల్.రాజేశ్వరి, యూటీఎఫ్ నాయకులు బీజే. ప్రభాకర్‌రావు, జి.ఏసురత్నం, చిట్టిబాబు, స్వర్ణరేఖ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయొద్దని వినతి



మాట్లాడుతున్న సందేశ్వరరావు తదితరులు

గుడ్లవల్లేరు: ఎస్సీ వర్గీకరణ చేయవద్దని గుడివాడ నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు చేబత్తిన సందేశ్వరరావు కోరారు. గుడ్లవల్లేరులో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ వలన తమ జాతి అన్ని రంగాల్లో నష్టపోతుందని ఏకసభ్య కమిటీ కమిషనర్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతిపత్రాన్ని మచిలీపట్నంలో అందించామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మేకల అనిల్, రేమల్లి ప్రసాద్, దారం నిరంజనరావు, అజయ్‌కర్ పాల్గొన్నారు.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

గుడివాడరూరల్: పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డు గుడ్‌మన్‌పేట రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టినందున సోమవారం పైప్‌లైన్ల ద్వారా తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పరిధిలో ఉన్న 12 నుంచి 18వార్డులు నైజాంపేట, బాపూజీనగర్, పాముల కాలనీ, గుడ్‌మన్‌పేట, పాత బైపాస్‌రోడ్డు, మరీదువారీ వీధి, కాకర్లవీధి, గీతాభవనం రోడ్డు, ప్రసాద్ షెడ్ రోడ్డు, ద్రోణాదులవారి వీధి తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు.

పన్ను వసూలుకు ఇళ్ల కొలతల నమోదు



మండవల్లి: మండవల్లిలో నూతనంగా నిర్మించిన ఇళ్లకు ఇంటి పన్ను వేసేందుకు కార్యదర్శి సాయి ప్రదీప్ శనివారం కార్యాచరణ ప్రారంభించారు. గ్రామం పరిధిలోని నూతనంగా నిర్మించిన ఇళ్లను సర్వే చేసి కొలతలను నమోదు చేశారు. ఈ సర్వే ఆధారంగా ఇంటి పన్ను నిర్ణయించి వసూలు చేస్తామని పేర్కొన్నారు.

మండవల్లిలో నగర సంకీర్తన

మండవల్లి: మండవల్లిలోని శ్రీ దత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు ఇంటింటికీ వెళ్లి భిక్ష స్వీకరించారు. గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పయ్యావుల సత్యనారాయణ పాల్గొన్నారు.

అలరించిన నృత్యోత్సవాలు



లవ కుశ నృత్య రూపకంలో ఓ ఘట్టం



నృత్యంలోని ఓ భంగిమలో ప్రముఖ నాట్య కారణి అరుణ రేఖ

పామర్రు: మొవ్వ మండలం కూచిపూడిలోని సిద్ధేంద్ర యోగి కళా పీఠంలో కూచిపూడి హెరిటేజ్ నాట్య అకాడమీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, సిద్ధేంద్ర యోగి కూచిపూడి కళా పీఠం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నృత్యోత్సవాలు అలరించాయి. దేశ విదేశాల నుంచి అనేక మంది నాట్యకారిణులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. కళాకారులు రాకతో కూచిపూడి గ్రామం పులికించిపోతోంది. లవకుశ నృత్య రూప నాటకం ఆహూతులను అలరించింది. పసుమర్తి శేషుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శ అందరినీ మైమరపింపజేసింది. ఫ్లోరిడాకు చెందిన నిర్మల నృత్యనికేతన్ బృందం సభ్యుల ఆధ్వర్యంలో నవ్య కళలు సనాతన నర్తనం, అధునాత కీర్తనం ప్రదర్శించారు. ఈ నృత్య రూపం ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. కళాకారులను పసుమర్తి వెంకటేశ్వరశర్మ, పసుమర్తి రాధేశ్యామ్ సత్కరించారు. భాగవతుల సేతురామ్ బృందం సభ్యులు 12 మంది కళాకారులచే ప్రదర్శించిన మోదమున, వినరోభాగ్యము నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను రంజింపజేశాయి.

నాట్య రామంచ అరుణ రేఖ సమాజంలో వృద్ధులకు జరుగుతున్న అన్యాయాన్ని భజ గోవింద్ నృత్య రూపకంలో ప్రదర్శించారు.



లవ కుశ నృత్య రూపకంలో మరో ఘట్టం

గ్రీన్ విలేజ్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: స్థానిక గ్రీన్ విలేజ్‌లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. లే అవుట్ వద్ద లబ్ధిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ముందుగా హౌసింగ్ ఏడీ శేఖర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం మొత్తం 94.52 ఎకరాల విస్తీర్ణంలో లే అవుట్‌కు కేటాయించిందన్నారు. మొత్తం 3,072 పాట్లకు కైకలూరు, మండవల్లి మండలాల్లో 2,761 మందికి పట్టాలు మంజూరు చేశామన్నారు. వీరిలో 2,017 మందికి ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాజకీయాలు చూడకుండా ప్రతి లబ్ధిదారుడికి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరుకు లబ్ధిదారులకు మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. దీంతో ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ సర్ చార్జీలు తగ్గించాలి



ఎన్టీఆర్ కాలనీలో మహిళలతో కలసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు ఆర్సీపీ రెడ్డి

గుడివాడరూరల్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ప్రభుత్వ సూచనల మేరకు విద్యుత్ అధికారులు ఈ నెల బిల్లులపై అదనంగా చార్జీల భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఆ వార్డు మహిళలతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెరగడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను తగ్గించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం పెంచిన విద్యుత్ బిల్లులను మహిళలతో కలసి సీపీఎం నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రజని, రేపాని కొండ, ఎల్.సురేంద్ర, ఎ.విజయ్‌కుమార్, ఎలవర్తి కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



శేరీదింటకుర్రు సదస్సులో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్



గాదేపూడిలో తహసీల్దార్ లోకరాజుకు సమస్య విన్నవిస్తున్న రైతు

గుడివాడరూరల్: గ్రామాల్లో రెవెన్యూపరమైన సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని శేరీదింటకుర్రులో శనివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కే గోపాల్ అన్నారు. మండలంలోని కానుకొల్లులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది అర్జీలు వివిధ సమస్యలపై అందజేశారు. రీ సర్వే డీటీ సుధారాణి, ఆర్ఐ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు..

గుడ్లవల్లేరు: తాము నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను స్వీకరిస్తామని తహసీల్దార్ బి.లోకరాజు పేర్కొన్నారు. శనివారం గాదేపూడి సదస్సులో అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ అర్జీలను పరిశీలించి, సమస్యల పరిష్కారం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, సర్పంచ్ వీర్నాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జేఎస్ సుభాని కోరారు. మండలంలోని చిన్నకామనపూడి, పెదకామనపూడి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు శనివారం నిర్వహించారు. చిన్నకామనపూడి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య పాల్గొన్నారు.

బైండ్ల కులానికి ఒక ఎంపీ, రెండు ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలి



కమిషనర్ మిశ్రాకు వినతిపత్రం అందిస్తున్న పెద్దిరాజులు

గుడ్లవల్లేరు: బైండ్ల కులానికి జాతీయ స్థాయిలో ఒక ఎంపీ, ఏపీలో రెండు ఎమ్మెల్యేల సీట్లు ఇవ్వాలని ఆ సంఘ కృష్ణాజిల్లా అధ్యక్షుడు నిడుమోలు పెద్దిరాజులు కోరారు. ఈ విషయమై మచిలీపట్నానికి శనివారం విచ్చేసిన ఏకసభ్య కమిటీ కమిషనర్ రాజీవ్ రంజాన్ మిశ్రాకు వినతి పత్రాన్ని అందించామని ఆయన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేసి...తమ బైండ్ల కులాన్ని ఎస్సీ ఏ కేటగిరీలో చేర్చాలని ఆయన కోరారు. వినతిని అందించిన వారిలో ఆ సంఘ నాయకులు కొడాలి వెంకటేశ్వరరావు, నాగరాజు, కనకయ్య, చీలి సుబ్బారావు, కొడాలి నరసింహారావు, ఎస్.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మండవల్లి: చింతపాడులో సీసీ కెమెరాల ఉపయోగాలపై కైకలూరు సీఐ రవికుమార్, ఎస్ఐ రామచంద్రరావు శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చింతపాడు అవగాహన సదస్సులో సీఐ రవికుమార్ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 10 మంది పోలీసులతో సమానమన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై సంచరించే గేదెలను, ఆవులను గోశాలకు తరలిస్తామని తెలిపారు. ప్రతిఒక్కరూ గేదెల కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అతికించాలన్నారు. సర్పంచ్ బి విష్ణు, ఎంపీటీసీ సభ్యుడు ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ విజయ ఫ్లోరెన్స్, ఎంపీడీఓ

గుడ్లవల్లేరు: బాల్య వివాహాలను అరికట్టాలని ఎంపీడీఓ వి.విజయసారథి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కిశోర వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.విజయ ఫ్లోరెన్స్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 11నుంచి 18ఏళ్ల బాల బాలికల విద్య, సంపూర్ణ ఆరోగ్యం, లింగ వివక్షత, బాల్య వివాహాలు అరికట్టడం, మానవ అక్రమ రవాణా, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన సూచనలను ఎంపీడీఓ విజయసారథి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.లోకరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, ఎంఈఓ జి.గోపాలరావు పాల్గొన్నారు.

• 31న పింఛన్ల పంపిణీ

గుడివాడరూరల్: జనవరి ఒకటో తేదీన నూతన సంవత్సరం కావడంతో ఈ నెల 31న పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన నగదును ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందికి అందించనున్నట్లు తెలిపారు.